# ఆనంద నందనము

"ఏమండీ! ఈసారన్నా మనకాడపిల్ల పుడుతుందంటారా?" నిండు చూలాలు వసంత నర్సుల సాయంతో లేబర్ రూమ్‌లోకెళ్తూ భర్తనడిగింది. దీనవదన పంచప్రాణాలు కళ్ళల్లో తచ్చాడు తున్నాయి.. "ఇది మూడో కాన్పు గదా! కష్టం కావచ్చు. జాగ్రత్తగా ఉండాలి." నాలుగు నెలల క్రితం లేడి డాక్టరన్న మాటలు చంద్రశేఖర్ బుర్రలో గిర్రు మాన్నయి. అంతరంగంలోని అల్లకల్లోలం గొంతుకడ్డు పడింది. అప్పటికే ఇద్దరు మగపిల్లలకు జన్మనిచ్చిన భార్య చేలతనం కలచివేసింది. అయినా, ఏదో ఒకటి చెప్పాలి గదా.

గొంతు సవరించుకుని "అది మన చేతుల్లో ఏముంది వసంతా! నువ్వు ధైర్యంగా ఉండు" అనగలిగాడు. ప్రతి కాన్పూ ఆడజన్మకు పునర్జన్మనే. కానీ, ఓ ఆడ నలుసు కోసం పరితపించిన మనసులు మూడో సంతానం ఆడపిల్లే కావాలనుకున్నాయి.

అనుకున్నట్టుగానే కాన్పు కష్టమైంది. అనుకోకుండా ఆపరేషన్ చెయ్యాల్సి వచ్చింది. ఆపరేషన్ కత్తి వసంత కడుపుతోపాటు వారి ఊహల ఉయ్యాలతాళ్ళను గూడా కోసిపారేసింది. మూడో సంతానం గూడా మగ బిడ్డ. పనిలో పని ట్యూబెక్టమీ ఆపరేషన్ పూర్తయింది.

"ఆ భగవంతుడెందుకిలా చేశాడండీ?" నిండుబాలెంత కంటి ధారలు అడిగాయి. భార్య వాలకం చూస్తుంటే భయమేసింది.

"అనుకున్నవన్నీ అక్షరాలా జరిగితే మనిషి దేవుడై పోతాడని భగవంతుని భయం!" బాధనంతా గుండె గూటిలో అదిమి పెట్టి భార్యకు ధైర్యం నూరిపోయాల్సి వచ్చింది. "అయినా, మగ పిల్లలకు పెళ్ళయితే కోడళ్ళొస్తారు. గదా! వాళ్ళే కూతుళ్ళను కుందాం. మన ముద్దూ ముచ్చటలు మనమరాళ్ళతో తీర్చుకోవచ్చు."

కాలంతోపాటు ఆశల గుర్రాలు పరుగెడుతుంటే ఉద్యోగపర్వంలో ఉన్నత స్థానం లభించింది. ఇద్దరు కొడుకుల పెళ్ళిళ్ళూ, ఇద్దరికీ చెరో ఇద్దరు మగ పిల్లలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు రొటీన్‌గా జరిగిపోయినై. మూడో కోడలు మెడలో మూడు ముళ్ళు పడ్డాక, అధః పాతాళంలో చతికిలబడిన ఆశ మళ్ళీ చిగురించి ఆకాశాన్నందుకుంది. మూడో కొడుకు మొదటి సంతానం ఆడపిల్ల. వంసత ఆనందంతో ఉక్కిరి బిక్కిరైంది. కళ్ళూ, ఒళ్ళూ సంతోషంతో తబ్బిబ్బయి పోతుంటే తన గుండెల మీద ఒరిగిపోయింది.

"నిజం.. నిజంగానా! నాకు మనుమరాలు.. నా మనుమరాలు.. నాయమ్మ, నా వరాల మూటను వెంటనే చూడాలి."

కుండపోత వర్షాలకు దండిగా నిండిపోయిన చెరువు కట్ట తెగినట్టు, అంత ఆనందాన్ని ఆ గుండె జీర్ణంచుకోలేక నరాలు తెగిపోయినై. ఆశలూ, ముద్దూ ముచ్చటలూ అన్నీ మరిచి చేతిలో చెయ్యేసి, అలౌకికానందాన్ని అనుభవించి పరలోకాలకు చేరుకుంది. మూతలు పడుతున్న కళ్ళు వైపత్నీకం అనుభవించమని తన నుదుటి మీద రాశాయి.

గత మూడు దశాబ్దాల మురిపాలను, జంట అనుభవాలను ఒంటరిగా నెమరేసు కొమ్మని తన దారిన తాను వెళ్ళిపోయింది. మాతృప్రేమ మధుర్యాన్ని మనసారా రుచి చూసిన చిన్న కొడుకు తన తల్లి పేరునే కూతురుకు పెట్టుకున్నాడు. "నాన్నా, మా అమ్మ నా కూతురు వసంత రూపంలో మన కళ్ళముందుంటుంది" అంటుంటే తన కళ్ళల్లోని మంచుతెరల మీద వసంత రూపం ప్రత్యక్షమైంది.

"ఎందుకంత బాధపడ్తారు? మనవరాలి రూపంలో మీతో నేను ఆడుకుంటాను" అంటూ చిరు నవ్వులు చిందించింది. మండు టెండలో తిరిగొచ్చి మంచి మజ్జిగ తాగినట్టయింది. కాలం కౌగిట్లో రెండు సంవత్సరాలు తిరగకముందే వసంతకు చెల్లెలు పుట్టింది. తన ఆనందానికడ్డుకట్ట వేస్తూ

"ఛీఛీ, మళ్ళీ ఆడపిల్ల. ఈ ఆడపిల్లలు పెరిగి గుండెల మీద కుంపట్లయి పోతారు." చిన్న కొడకు చీదరించుకున్నాడు.

చిన్న కోడలు చిర్రుబుర్రులాడుతూ, "ఆ మహాతల్లి బతికున్నన్ని రోజులు ఇంట్లో ఆడపిల్ల పుట్టలేదని మహా ఇదైపోయింది. ఇహ చూడండి, ఇద్దారాడపిల్లల పెళ్ళిళ్ళు చెయ్యాలంటే తాత ముత్తాతలు ఆల్తిలు దిగొస్తారు. మొదటి ఆడపిల్ల కావిడ పేరు పెట్టుకున్నా, మనమీద శీతకన్నేసింది." చేతులు మూతులు తిప్పింది. "అపుత్రస్య గతిర్నాస్తి అన్నారు. గదా! మనం చస్తే ఎవరో ఒకరు తల కొవివి పెట్టినా, ఏటేటా పిండ ప్రదానం చేసేదెవరు?" భర్తను నిలదీసింది.

ఉబుసుపోనమ్మ ఉరేసుకు చచ్చిందన్నట్టు, తప్పంతా చచ్చిన అత్తగారి దేనన్నట్టు ఎందుకలా రెచ్చిపోతుందో అర్థం కాలేదు.

చిన్న చిన్న మాటలతో బుల్లి బుల్లి నడకలతో మనుమరాలు వసంత మనసును దోచేస్తోంది. పొద్దున్నే, "తాతయ్యా" అంటే పరుగెత్తుకొచ్చి ఒడిలో కూర్చుంటుంది.

ముప్ఫై అయిదేళ్ళ సర్వీసుకు భరత వాక్యం పలుకుతూ రిటైర్మెంట్ వయసు నెత్తి మీదికొచ్చింది. పెన్షన్ సౌకర్యం లేని కార్పొరేషన్ ఉద్యోగం రాం రాం చెప్పేసింది. వచ్చిన పి.ఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లోంచి ఇద్దరు మనుమరాళ్ళ పేర చెరో లక్షఫిక్స్‌డ్ డిపాజిట్ చెయ్యడంతో ఇంటి వాతావరణం కొంత సద్దు మణిగింది. అదెంతో కాలం నిలువలేక కొత్త తుఫానుకు రూపకల్పన చేసింది. మొదటి, రెండవ కొడుకు, కోడళ్ళు సూటిపోటి మాటల ఈటెల ప్రయోగం జోరైంది.

"ఇన్నాళ్ళు బతికి ఇంటెనక చచ్చినట్టు... నాన్న రిటైర్మెంట్ ఇస్తరాకు, మంచినీళ్ళు తప్ప మాకేమిచ్చింది?" అంటూ పెద్ద కొడకు తనతో ఆడుకుంటున్న అతని పెద్ద కొడుకును లాక్కెళ్ళాడు.

మీకివ్వకపోతే ఏం? పెళ్ళాం పేరున్న మనుమరాలికీ, మరో మనుమ రాలికి చెరో లక్ష కట్టబెట్టారు గదా!" పెద్దకోడలు మూతి మూరెడు, చేతులు బారెడు తిప్పి మరో కొడుకును ఈడ్చుకెళ్ళింది. పెద్దల ప్రవర్తనను చిన్నారి వసంత చిత్రంగా చూస్తోంది. గుండెలకు గుండునూదులు గుచ్చినట్టయింది.

మరో రోజు... రెండో కొడుకు మొదటి కొడకు, "తాతయ్యా! ఈ సూత్రం అసలే అర్థం కాలేదు. ఓసారి చెప్పవా." మ్యాథ్స్ పుస్తకం పట్టుకొచ్చి పక్కన కూర్చున్నాడు చదువుతున్న వార్తా పత్రికను పక్కన పెట్టి తాను పుస్తకం ముందు కూర్చున్నాడు. రెండో కోడలు రుద్రకాళిలా కళ్ళు తెరిచి, "ఆ పెద్దమనిషి చెప్పడం, నువ్వు వినడం... బాగానే ఉంది సంబడం. ఎందుకీ పెదాల మీద ఒక్కటిచ్చి, "అదెదో మీ నాన్నగారు చెప్తారు పదా! అంటూ పుస్తకంతో సహా లాక్కెళ్ళింది. అక్కడే ఉండి అంతా చూస్తున్న చిన్న కోడలు తల వంచుకుని లోపలికెళ్తూంటే, చిన్న కొడకు- ఆఫీసర్ వెంట అ టెండర్లా పెళ్ళాంననుసరించాడు.

మనసు అల్లకల్లోల సముద్రమైంది. ఆ సముద్ర కెరటాలు శరీరాన్ని అతలా కుతలం చేస్తూ కళ్ళ దాకా పాకాయి. లోకమొక కాకుల వనంలా, అందులో తానో పావురంలా.. ఏవేవో ఆలోచనలు.

"ఏమైంది తాతయ్యా?" బుడి బుడి నడకలతో వసంత వచ్చి మీద కూర్చుంది. "కంట్లో నలుసు పడిందా!" అరచేతులతో కళ్ళు తుడిచింది.

నాయమ్మనే. నా తల్లి... ఇది నా వసంతనే! "అవునమ్మా! నా ఇంటి నలుసు నా కంట్లో పడింది తల్లీ!" బుగ్గలు ముద్దాడగానే కిలకిలా నవ్వింది. ఆ నవ్వు నయాగరా జలపాత నవ్వడిలాగా మనసును శాంతింపజేసింది. మనుమరాలితో ఆటా పాట.. గుండెల్ని ఉతికి అరేసింది.

అదే రోజు సాయంత్రం కొడుకులు, కోడళ్ళందరినీ సమావేశపరచి మనోవ్యధను బయట పెట్టక తప్పలేదు. ఎప్పుడూ "మామయ్యా!" అంటూ ఆపాయంగా పలుకరించే కోడళ్ళ మనసు గోడలను ఏ మలినం అంటుకుందో గాని పరాయి మనిషి ముందున్నట్టు మాట్లాడారు.

"ఈ ఇంట్లో ఆడపిల్ల పుట్టాలన్న పెద్దల కోరిక మా పాలిట శాపమైంది. ఇద్దరాడపిల్లల పెళ్ళిళ్ళంటే మాటలా!" చిన్న కోడలు చిత్రాంగి అవతారమెత్తింది. సుదీర్ఘమైన తపస్సులో లీనమైన మునిలా చిన్న కొడకు అలానే కూర్చుండి పోయాడు.

" మీ కడుపున పుట్టిన మా ముగ్గుర్నీ కంటికి రెప్పలా చూసుకున్నారు. గదా! ఇప్పుడీ అసమ దృష్టి ఎందుకు నాన్నా?" పెద్దవాడు నిలదీశాడు. ఆ అమాయకునికి అంత ధైర్యమెలా వచ్చిందో!

"తల్లితండ్రుల అసమదృష్టి తనయుల పాలిటశాపం నాన్నా!" రెండో కొడుకు పిల్లలకు చెరో లక్ష ఇచ్చారు. మా పిల్లలేం పాపం చేశారనీ! మా అమ్మే ఉంటే ఇలా జరగనిచ్చేదా?"

"మీ అమ్మే ఉంటే నా బతుకిలా తెల్లవారనిచ్చేదా?" ప్రశ్న గొంతు దాటలేదు. "అది కాదురా!" సమాదాయింపు సవారి చెయ్యక తప్పలేదు. "ఓ ఆడపిల్ల కాళ్ళు కడిగి కన్యాదానం చేసే బాగ్యానికి మేము నోచుకోలేదు గదా! ఆ అదృష్టం వానికి కలిగింది."

"ఆ అదృష్టం ఖరీదు రెండు లక్షల రూపాయలన్న మాట." రెండో కోడలు కొండెక్కి కూర్చుంది. పెద్ద కోడలి వైపు ప్రేమగా చూస్తూ. "మా కడుపున గూడా ఓ ఆడకాయ కాస్తే మేం వద్దన్నామా! కన్యాదానం పుణ్యంతో పాటు ధనలక్ష్మి గూడా కలిసొస్తుందని కలగన్నామా." బుగ్గలు నొక్కుకుంది.

సూటిగా గుండె నరాలకు గుచ్చుకొనే సూటిపోటి మాటల ఈటెల ప్రయోగంతో రెండు గంటల చర్చ జరిగింది. నలుగురు మనుమల పేర తలా పాలిక వేల ఫిక్సెడ్ డిపాజిట్ నిర్ణయంతో సమావేశం ముగిసింది.

ముప్పై అయిదేళ్ళ సేవ చేయించుకున్న సంస్థ మూడున్నర లక్షల రూపాయల మూట నెత్తిమీదుంచి మళ్ళీ అటువైపు తిరిగి చూడొద్దని హెచ్చరించి పంపించింది. ఇహ శేషజీవితానికి మిగిలింది యాభై వేల చిల్లర.

ఇంటి వాతావరణం తుపాను వెలసిన తీరప్రాంతం లాగైంది. ముందటి ప్రేమాభిమానాలు మూలకు పడిపోయినై. ఒకే ఇంట్లో మూడు కుటుంబాల. ఎవరి సంసారం వారిది. ఎవరి సాధకబాధకాలు వారివి. మధ్యలో తనకో గది. తలా ఓ నెల అన్నపానీయాలు సమకూర్చుతూ సజీవంగా ఉంచుతున్నారు. అన్నానికి ఆరాటం లేదు గాని ఆత్మీయుత మాయమైంది. జీవన సంధ్యాసమయం, ఒంటరిగా పగలు అయోమయం, రాత్రంతా భయం భయం. కొడుకులైనా, కోడళ్ళైనా, మనుమలైనా అవసరం నిమిత్తం పిలిస్తే పలుకుతారు. సమయానికి అన్నమో, ఛాయనో పంపిస్తారు. మిగతా సమయాల్లో తన గది వైపు తొంగి చూడరు.

భార్య వసంత ఫోటో మీద చూపుల దొంతరల పేరుస్తూ పోతుంటే ఎంతకాలం గడుస్తుంది?

వసంతా! ఒక్కోసారి గుండె పొంగులు గొణుగుడు రూపంలో పెదాల మీదికొస్తుండేవి. "చూస్తున్నావా! ఆడపిల్లల పేరు మీద అలముకున్న తుపాను. ఈ ఇంటి కంటే జైలు నయం జైల్లో కాపలాదార్లన్నా పలుకరిస్తుంటారు. కష్టసుఖాలు కలసి అనుభవిద్దామని ప్రమాణం చేసిన నవ్వేమో నా మానాన నన్నొదిలేసి ఒంటరిగా ప్రయాణమై పోతివి. అయినా, ప్రేమ పేద ఆరాటం పెదవికే చేటు."

సవాళ్ళ తూటాలు ఎదురువుతున్న సమయంలో సహకరించని ఆరోగ్యం. అప్పుడప్పుడు బయటికెళ్ళిరావటం. మిగతా సమయాల్లో ఇంట్లోనే. ఇల్లొకనరకం. ఎప్పుడో ఓసారి మనుమరాలు వసంత పరుగెత్తుకొచ్చి పక్కన కూర్చుండేది. బుల్లి కళ్ళను, చిన్నారి చేతులను గమ్మత్తుగా తిప్పుతూ, "తాతయ్యా! మా స్కూల్లో..." అంటూ ఏవేవో కబుర్లు చెబుతుంటే - ఎండాకాలం ఎడారి ప్రయాణంలో చెట్టు నీడన ఊటచెలమ కనిపించినట్టు అనిపించేది. కానీ, వాళ్ళమ్మ వరదలా వచ్చేసి లేత చెంపల్ని చిదిమేస్తూ ఈడ్చుకెళ్తుంటే గుండెల్ని పిండేసినట్టనిపించేది.

వసంతను వాళ్ళమ్మమ్మ ఊరికి పంపించారట. అక్కడే ఉంచేస్తారట. గుండెల్లో గుండ్రాయి దొర్లింది. ఇహ లాభం లేదు. జీవిత ఖైదీకి కాలపరిమితి ఉంటుంది. కానీ,

సొంతింటి ఖైదీకి అదేమీ లేదు. ఇంకా ఇంటిచూరు పట్టుకు వేళ్లాడ్డమెందుకు? వృద్ధాశ్రమమే శరణ్యం. ఆలోచన ఆచరణలోకొచ్చింది...

"ఏంది శేఖరన్నా! గట్లా చూస్తున్నవ్! పూలమొక్కల్ని చూస్తుంటే ఏదన్నా గుర్తుకొస్తుందా?" తోటి వృద్ధుడు తుకారాం తోటలోకొచ్చి పక్కన కూర్చుని భుజం తట్టాడు.

"సంధ్యాసమయం. వాలిపోయిన పొద్దులో రాలి పోయిన అనుభవాలు ఏరుకుంటున్నాను." ఇటు తిగిగాడు చంద్రశేఖర్. తమలపాకు నమిలిన తన్వంగి నాలుకలా సూర్యుడు పడమటి ఆకాశం అరుణవర్ణమైంది. తమ గృహానికెళ్తూ చిరునవ్వులు విసురుతున్నాడు. ఆ నవ్వుల పువ్వులు కొమ్మా రెమ్మల మీద వాలి పచ్చని తోటను పరవశింపజేస్తున్నాయి. చల్లని పిల్లగాలి తెరలు ఒంటిని హాయిగా తడుము తున్నాయి.

"అవునన్నా!" చంద్రశేఖర్ ఉత్సాహం మలుపులు తిరిగింది. "నేనీ ఆశ్రమానికొచ్చి ఆర్నెల్లు దాటింది గదా!" పిచ్చాపాటీ ముచ్చట్లకు దిగారు. తుంటరి ఒంటరితనం జుట్టు పీక్కుంటూ పారిపోయింది. అది ఆత్మానందం.. అలౌకికానందం.

రాజీవ్ రహదారి పక్కన కొండపాక గ్రామ శివారు కొండల మధ్యన, కోనేటి రాయడి బంగారు వాకిలిని తలపింపజేసే ప్రశాంత వాతావరణంలో రూపు దిద్దుకున్న 'ఆనంద నిలయము' వృద్ధాశ్రమం. మూడు పురుషార్థాల కాలవాలమైన కష్టసుఖాల కావడిని మోస్తు జీవనయానంలోని అనుభవాలను మూటలు కట్టుకుని దిక్కు తోచక చౌరస్తాలో నిల్చున్న సీనియర్ సిటీజన్స్ కోసం వెలసిన విశ్రాంతి కేంద్రం ఇల్లు అనే జనారణ్యంలో గాయపడిన మనసులకు హాయి మలాం పూసుకుంటూ, గత అనుభూతులను నెమరుకు తెస్తూ నాలుగో పురుషార్థాన్ని గుర్తు చేస్తున్న నయనానందకర ప్రదేశం.

ఉదయ కిరణాల కంటే ముందే మేలుకొలుపు. నిత్య కాలకృత్యాల తర్వాత పరువు లాంటి పచ్చని గడ్డి మీద చేతనైన యోగసనాలు, శారీరక వ్యాయామం. శారీరక మలినాన్ని తొలగించే స్నానం తర్వాత మానసిక మాలిన్యాన్ని కడిగేసే దైవ ప్రార్థన. పాలు లేదా ఛాయ్ సేవనం. పత్రిక లేదా పుస్తక పఠనం. తొమ్మిదింటికి అల్పాహారం. ఉదయం కార్యక్రమాలు. మధ్యాహ్నం వయసుకు సరిపడే భోజనం, విశ్రాంతి. సాయంత్రం చాయ్ లేదా పాలు సేవించాక ఆటలు, చిన్న చిన్న వ్యాయామాలు. ఆ తర్వాత మనోరంజన కార్యక్రమాలు. రాత్రిభోజనం. పిచ్చాపాటి ముచ్చట్లు, నిద్ర అంతా కలసి కడుపు నిండా భోజనం, కంటి నిండా నిద్ర.

ఇలా కాలంతో చెట్టపట్టాలేస్తూ సమయానుసారం నిత్య కార్యక్రమాలు జరుగుతుంటాయి. అన్ని కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలనే నిర్బంధమేదీ లేదు. శారీరక, మానసిక పరిస్థితినసుసరించి ఎవరిష్టం వారిది. వారానికొకసారి వైద్య పరీక్షలు తప్పనిసరి. మిగతా సమయాల్లో ఫోన్ పిలుపునందుకుని కారులో పరుగెత్తుకొచ్చే డాక్టరు-మానవ సేవయే మాధవ సేవ అన్న పెద్దల మాటను చద్ది మూటగా భావిస్తాడు.

మాటల్లో ఆత్మీయత పంచిపెట్టే వంట మనుషులు, వ్యవహారాల్లో మనసు లోతుల్ని తట్టగల మేనేజర్, పాపపుణ్యాల బేరీజు వేస్తూ ప్రతి మనిషిలో పరమాత్మను దర్శించుకునే ట్రస్ట్ బోర్డు చైర్మన్... ఆనంద నిలయమనే వృద్ధాశ్రమం ఆనంద నందనవనంగా వర్ధిల్లాలని ఆశయం, సమష్టి కృషి.

"ఈరోజో రిటైరైన ఐ.ఏ.ఎస్ ఆఫీసర్ మన ఆశ్రమంలో చేరాడు గదన్నా!" మామిడి రెమ్మల సయ్యాటను అరమోడ్పు కళ్ళతో చూస్తున్నాడు అరవయ్యేళ్ళ తుకారాం. ఇద్దరు కొడుకులు ఒకే ఒక కూతురు...చదువులు, పెళ్ళిళ్ళ బాధ్యతల బరువులు దించుకుని కీళ్ళనొప్పుల బాధల బరువునెత్తుకుని వచ్చి ఆశ్రమంలో చేరాడు. చల్లని గాలి కితకితలకు పులకింతల నవ్వులు రువ్వుతున్న మల్లెపూల మీదినుంచి చంద్రశేఖర్ దృష్టి మళ్ళింది.

"మనిషి చెయ్యని పాపానికి దేవుడు విధించే శిక్ష వృద్ధాప్యం. దానికి ఐ.ఏ.ఎస్సూ, అడుక్కునేవాడూ అనే తేడా లేదు గదన్నా!"

"నిజమే పాపం! ఆ ఐ.ఏ.ఎస్‌కు మగపిల్లలు లేరటా. అల్లుళ్ళే కొడుకులు, కూతుళ్ళే సర్వస్వమనుకుని కోట్లాది రూపాయల ఆస్తుల్ని వాళ్ళ కొంగులకు ముడేశాడటా. భార్యను పోగొట్టుకుని మంచం పట్టాక తెలిసిందటా, అన్ని రోజులూ తాను భ్రమల్లో బతికానని. అల్లుళ్ళ బెదిరింపులు, కూతుళ్ళ చీదరింపులు భరించలేక నరకయాతన అనుభవించాడటా. "

"ఇద్దరన్నలు ఇక్కడున్నారా!" అరవై నిండని జగదంబ కర్ర సాయంతో వచ్చి ఎదురుగా కూర్చుంది. వంకర్లు తిరిగిన నుదుటి రేఖలు, ముగ్గుబుట్ట తల. చెంపల మీదాడుకుంటన్న తెల్లని వెంట్రులను మునివేళ్ళతో సవరించు కుంది. కొన కొంగతో నుదురుఅద్దుకుంది. జీవన మాధుర్యాన్ని దోసిళ్ళతో తాగించిన భర్త పోయాక, పిల్లల మధ్య ఇమడలేక, బంధువులు గూడా రాబందులయ్యారని గ్రహించి బంధాలు తెంచుకుని ఎగిరొచ్చిన నేపథ్యాన్ని గుండెల్లో దాచుకుంది. "ఏమ్మా పాలు తాగావా?" మూడేళ్ళ మనుమరాలిలా కనిపించిందామె తుకారాంకు.

"ఈ రోజు తల నొప్పిగా ఉంది. చాయతాగినానన్నా!"

"రాత్రికి అన్నం తీసుకోవద్దని డాక్టర్ చెప్పిండుగదా. గుర్తుందామ్మా?" సొంత అన్నయ్యలా అడిగాడు చంద్రశేఖర్, ఎక్కడి నుండో ఎగిరొచ్చిన పక్షులను ఏటి మడుగు ఏకం చేసినట్టు – ఆశ్రమ వాసుల్ని సుహృద్భావన కట్టి పడేస్తుంది.

"ఆఁ ఆఁ... నిన్నట్నుంచి మీలెక్క నేనుగూడా రొట్టె తింటున్నా. ఏందోనన్నా అంత చిన్న ప్రాణానికి ఇంత పెద్ద శరీరం. మోయలేకపోతున్నా" కాళ్ళు బార్లా చాచి, చేతుల్ని వెనక్కు తిప్పి అరచేతుల్ని నేలకానించింది. చూపులు ఆకాశం వైపున్నాయి.

"బాధ్యతల బరువు దించుకున్నా, ఇది తప్పదు గదమ్మా." మూడు ప్రాణాలు స్వేచ్ఛగా నవ్వుకున్నాయి. జగదంబ హాయిగా ఊపిరి పిల్చుకుంది.

"ద్వాపర యుగంలో కూడా ఇలాంటి ఆశ్రమాలుంటే కురుపాండవుల పోరు చూడలేక భీష్మ పితా మహుడు గూడా చేరిపోయేవాడేమో!" మతలబును మహాభారతం వైపు తిప్పింది.

మనసు చిలకలు రెక్కలు విప్పినై. చర్చ సాగుతూనే ఉంది. మధ్యలో జోకులు, నవ్వులు, ఎన్నో... మరో లోకంలో విహరించినట్టుంది. అలా ఎంత సేపున్నారో... కాని కడుపులో ఎలుకల పరుగులు కాళ్ళను భోజనశాల వైపు నడిపించాయి.

వాక్చాతుర్యం గల పొగరుబోతులా ఏప్రిల్ ఎండలు పెట్రేగిపోతున్నాయి. ఉదయం పదింటికే ఉక్కపోత ప్రారంభమైంది. కమ్మని ఉప్మా కడుపులోకెళ్ళగానే చంద్రశేఖర్ తన గదిలోకొచ్చాడు. ఆశ్రమ గ్రంథాలయం నుంచి తెచ్చిన ఆధ్యాత్మ రామాయణం అందుకుని పడక్కుర్చీలో జేరగిలబడ్డాడు. కళ్ళు అక్షరాల వెంట పడుతుంటే మనసు మాధుర్యాన్ని అనుభవిస్తోంది.

ఝుణ్ ఝుణ్... గల్ గల్.... ఘల్లు ఘల్లు... కాలి అందియల సవ్వడి చెవులకు సోకుతోంది. అందాల బొమ్మ హంసలా నడిచొచ్చి ఎదురుగా నిల్చుంది. ఎర్రని పెదాల మీద తెల్లని చిరునవ్వు కిరణ పుంజాలై మెరుస్తోంది. చూపులు ఆమె మీదనే. ఏకాగ్రత ఎటో ఎగిరిపోయింది.

"నువ్వా వసంతా!" ఆశ్చర్యానందాలు, నూతనోత్సాహం. "అవును. నేనే తాతయ్యా!" చిన్నారి వసంత. అప్పుడే లేత చిగురులు భోంచేసిన వసంత కోయిల గొంతులాగుంది. అమాంతం ఎత్తుకుని ఒళ్ళో కూర్చోబెట్టుకున్నాడు. లేత గులాబి చెంపల మీద ముద్దుల వర్షం కురిసింది. "నువ్వెట్లా వచ్చావమ్మా?"

"నాన్నతో."

"నాన్ననా ఏడీ? ఎక్కడా?"

"బాగున్నావా నాన్నా?" చిన్న కొడుకు తప్పు చేసి పట్టుబడిన దోషిలా తల వంచుకు నిల్చున్నాడు.

"ఆఁ ఆఁ! అన్నయ్యలూ, పిల్లలూ...."

"అంతా బాగానే ఉన్నారు కానీ, నాన్నా..."

"ఆఁ కానీ ఏమిట్రా?"

"మాకు నువ్వే దిక్కు గదా! నువ్వక్కడ లేకపోతే!"

"ఏమీ కాదు గానీ, అసలు సంగతేమిటో చెప్పు."

"మా మామగారు పోయారు."

"అయ్యో పాపం! మహానుభావుడు. అదృష్టవంతుడు. ప్చ్. ఏ పండుటాకైనా చెట్టును పట్టుకుని ఎన్నాళ్ళు వేళ్ళాడు తుంది? ఏదో ఒక రోజు దానికి పిలుపొస్తుంది. నేల రాలి పోతుంది." మనసులో స్థిరత్వం, మాటల్లో గాంభీర్యం...ధ్యానంలోకెళ్ళబోతున్న యోగిలాగయ్యాడు. చిన్న కొడుకు తల చివ్వున పైకి లేచింది. కళ్ళలో కంగారు.

"అది కాదు నాన్నా! ఆస్తుల పంపకాల కోసం మా బామ్మర్దులు తగవులాడుకుంటున్నారు. కన్నతల్లిని బాధ పెడుతున్నారు. పాపం మా అత్తయ్య, నా భార్య బాధపడుతున్నారు."

"అవన్నీ నాకెందుకు చెప్తున్నావురా?"

"ఎందుకంటే, నువ్వంటే మాకూ, మా బామర్దులకూ, అత్తగారికీ ఎంతో గౌరవం. మమ్మల్నందరిని వదిలి నువ్విక్కడుండడం మాకు అవమానం."

"నాకు సంబంధించినంతవరకు మానాభిమానాలు, మానావమానాలః నావి. వాటికీ మీకూ సంబంధం లేదు. చతుర్విధపురుషార్థాల్లో ధర్మార్థకామాలు మాత్రమే మరొకరితో పంచుకునేవి. కానీ మోక్షమలా కాదు."

"అంత పెద్ద ధర్మసూక్ష్మం నాకర్థం కాదు గానీ, నువ్వు నాతో రావాలి. మనింట్లోనే ఉండాలి."

"ఉండి."

"మా బామ్మర్దులు, అత్తగారు నువ్వెట్లా చెబితే అట్లా వింటామంటున్నారు. వాళ్ళు కోటీశ్వరులుగదా! వాళ్ల ఆస్తుల పంపకాలు మీ చేతుల మీదగా జరిగితే..."

"అదాసంగతీ! కోటిశ్వరులైనా, కూటికి లేనివారైనా ఆత్మీయతానురాగాలు తగ్గుముఖం పడుతుంటే, అత్యాశ పెరిగిపోవడం సహజం. ఈ ఆనంద నందనాన్ని వదిలి నేను మళ్ళీ ఆ బురద గుంటలో ప్రవేశించాలా? బంధాల కబంధహస్తాల్లో ఇరుక్కుపోవాలా? నేను రానురా!" స్థిర నిర్ణయం వెలువడింది. చిన్నారి వసంత నుదరు ముద్దాడి కిందికి దింపాడు.

"నాన్నా!" కొడుక్కు కోపమొచ్చింది. "బాగా ఆలోచించుకో చస్తే తల కొరివి పెట్టాల్సింది కొడుకులే. ఉత్తర క్రియలు చేసి పిండ ప్రదానం చేసేది కొడుకులే..." ఆవేశం బుసబుసమంటోంది.

"ఆపురా ఆపు." చంద్రశేఖర్ గర్జన. పక్క గదుల వాళ్ళు పరుగెత్తుకొచ్చి అతని వెనుక నిల్చున్నారు. కొడుకు కోపం అయోమయంగా మారింది. "అది కాదు నాన్నా!"
"ఏది ఏమాన్నా కానీ. ఇక్కడి కొచ్చిన వాళ్ళంతా మృత్యు దేవత రెక్కల మీద ఎక్కి ఎగిరిపోయేందుకు ఉవ్విళ్ళూరుతుంటారు. అయినా ఈ ఆశ్రమంలో అంతిమ శ్వాస వదిలిన వాళ్ళందరికీ శాస్త్రోక్తంగా అంత్యక్రియలు జరుగుతున్నాయ్. ఆశ్రమంలో చేరగానే గయ పుణ్య క్షేత్రానికి వెళ్ళి స్వపిండప్రదానం చేసొచ్చే సౌకర్యముంది. అపుత్రస్య గతిర్నాస్తి అని చెప్పిన శాస్త్రమే దానికి తరుణోపాయం చెప్పిందిరా!"

**ఇండియా టుడే 27 మే, 2003**

✱ ✱ ✱ ✱

కథా నిలయం
శ్రీకాకుళం